క్లుప్తంగా

నిరాశ్రయుల గృహంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు పరిధి భీమ్‌నగర్ నిరాశ్రయుల గృహంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆ సంస్థ విశాఖ జిల్లా కన్వీనర్ డాక్టర్ కుప్పిలి సురేష్‌బాబు పాల్గొని నిరాశ్రయులకు వైద్య పరీక్షలు జరిపారు. ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలిచ్చి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ముఖ్యోద్దేశం వివరించారు. అంటువ్యాధులు, విష జ్వరాలు, టీబీ, ఎయిడ్స్, కోవిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు.

నేడు ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల అల్ముని అధ్యక్షుడు అజ్జరాపు సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్క పూర్వ విద్యార్థి సహకారం ఉండాలని, కాబట్టి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో రమేష్ నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులు నైతిక విజయం సాధించారు

డాబాగార్డెన్స్: వాకపల్లి కేసులో బాధితులు నైతిక విజయం సాధించారని మహిళా చేతన కార్యదర్శి కె. పద్మ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా 21 మంది ప్రత్యేక పోలీసు బృందం 2007, ఆగస్టు 20న ఏఎస్‌ఆర్ జిల్లా జి- మాడుగుల మండలంలోని వాకపల్లి గ్రామానికి వెళ్లారన్నారు. అలా వెళ్లిన పోలీసులు తమపై లైంగిక దాడికి పాల్పడ్డారని 11 మంది ఆదివాసీ మహిళలు ఆ రోజు ఉదయమే ఫిర్యాదు చేశారన్నారు. వీరంతా పీవీటీజీకి చెందిన కొంద ఆదివాసీలని తెలిపారు. ఈ మహిళలు అప్పటి నుంచి న్యాయ పోరాటం సాగించారని చెప్పారు. ఈ కేసులో దర్యాప్తు సక్రమంగా జరగలేదని మహిళా సంఘాలు, ఆదివాసీ సంఘాలు, మానవ హక్కుల సంఘాలు ఎన్నో ఏళ్లుగా అంటున్నది నిజమేనని రుజువైందన్నారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక ప్రతినిధి కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం, చైతన్య మహిళా సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



35వ వార్డులో స్థానిక మహిళకు సీఎం జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి. చిత్రంలో వీసం రామకృష్ణ, కొల్లి సింహాచలం తదితరులు

జగన్ వెంటే జనం

- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన
- సీఎం చేసిన అభివృద్ధిని.. అందించిన సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే వాసుపల్లి.. పార్టీ నేతలు

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో కూడా ఆయననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించారు. 'మా నమ్మకం నీవే జగనన్న.. జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా పర్యటించిన నేతలకు ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము పొందిన లబ్ధిని ప్రజలు నాయకులకు తెలిపారు.

జగదాంబ : 'మా నమ్మకం నీవే జగనన్న.. జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలో ముందంజలో ఉందన్నారు. కాని ప్రతిపక్ష పార్టీలు సీఎం చేపడుతున్న అభివృద్ధి పథకాలను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పుడు ప్రజలతో మమేకం కావాలని సీఎం జగన్ పిలుపు ఇచ్చారని, అందులో భాగంగా ప్రజలను కలిసి సీఎం చేపట్టిన పథకాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకం తర్వాత మొట్టమొదటి సారి భారీ కార్యక్రమంతో ప్రజలతో మమేకమవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 20వ తేదీ వరకు..

శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు 'జగనన్నే మా భవిష్యత్తు'కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వాసుపల్లి స్థానికులకు వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. డోర్ స్టిక్కర్లు, సెల్ స్టిక్కర్లు అంటించారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ పరిశీలకుడు వీసం రామకృష్ణ, రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కనకమహాలక్ష్మి అమ్మవారి ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు ప్రెసిడెంట్ అలపన కనకరెడ్డి, సీనియర్ నాయకులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు కర్రి నీలకంఠం, దొడ్డి రామానంద్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



దుర్గాలమ్మ గుడి వద్ద ప్రజలతో ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ భాస్కరరావు



రామ మందిరం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రంధి గోపి తదితరులు



స్థానికంగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గోపి, ప్రసాద్

సీతారాముల సన్నిధిలో..

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 33వ వార్డు బంగారుమెట్టలో సీతారాముల తోడుగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం ప్రారంభమయింది. వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో బంగారుమెట్ట, శ్రీ రామాంధ్ర యువజన సమాజం వద్ద ఏర్పాటు చేసిన సీతారాముల మండపంలో ముందుగా పూజలు నిర్వహించిన అనంతరం వారు గడప గడపకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి అందజేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, ఆడారి వెంకట మహేష్, కొడమంచిలి శ్రీను, కొల్లి సత్యవతి, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయంలో దొంగతనాలపై అరకొర చర్యలు

- సిబ్బంది చేతివాటంపై స్పందించని అధికారులు



ఎర్నిమాంబ ఆలయం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ దేవస్థానంలో గత నెల 20న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీనివాస్ వేకువ జామున హుండీలో నగదు దొంగిలిస్తూ సెక్యూరిటీకి, ఆలయ పురోహితుడికి దొరికిపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా తాత్సారం చేశారు. దొంగతనం విషయం బయట పడడంతో ఆలయ ఈవో సాయిబాబా కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి రెండు వందలు తస్కరించినట్లు గుర్తించారు. అది చిన్న దొంగతనమే అంటూ కేసు నమోదు చేసి వదిలేశారు. ఈవో బాబా ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు.

ఫిర్యాదు చేశాం

దొంగతనంపై పోలీస్ కంప్లెయింట్ ఇచ్చి ఎంక్వైరీ చేయించాం. దొంగతనం చేసినట్లు పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించి నిర్ధారించారు. హుండీపై నుంచి చేయి పెట్టి రెండు వందలు తీసినట్లు పోలీసుల ఎదుట అంగీకరించడంతో శ్రీనివాస్‌ను, సెక్యూరిటీ గార్డ్‌ను ఉద్యోగం నుంచి తొలగించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించాం.

– సాయిబాబా, ఆలయ ఈవో

9న ఆభరణాల ప్రదర్శన



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

డాబాగార్డెన్స్: మహిళలు.. యువతులు మెచ్చే లేటెస్ట్ బంగారు ఆభరణాల ప్రదర్శన ఈ నెల 9న నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్లో నిర్వహించనున్నట్టు శ్రీకృష్ణ జ్యూయలరీ ప్రతినిధి యర్రంశెట్టి మల్లికార్జునరావు తెలిపారు. ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని కోల్కి డైమండ్స్, ఆంటిక్ వంటి లేటెస్ట్ ట్రెండ్స్‌తో సరికొత్త ఆభరణాల కలెక్షన్స్‌తో ఈ నెల 9 ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు.

పక్షుల సంరక్షణ అందరి బాధ్యత



తాగునీటి గిన్నెలు పంపిణీ చేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

మద్దిలపాలెం: వేసవి తాపం నుంచి పక్షులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, వాటి దాహార్తి తీర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పిలుపునిచ్చారు. పక్షుల సౌకర్యార్థం తాగునీటి గిన్నెల పంపిణీ కార్యక్రమం మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో శుక్రవారం గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. మావూరి ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురికి తాగునీటి గిన్నెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా పక్షుల జీవనానికి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడికక్కడ పక్షులు దాహార్తిని తీర్చుకోవడానికి అనువుగా తాగునీటి గిన్నెల ఏర్పాటు చేయడానికి గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ముందు రావడం అభినందనీయమన్నారు. డ్రగ్స్ డీజీ రవిశంకర్ నారాయణ్ మాట్లాడుతూ పక్షుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన గిన్నెలను రోజూ నీటితో నింపాలని సూచించారు. గ్రీన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు గీతానారాయణ్ సుడగాని మాట్లాడుతూ పదేళ్లుగా పక్షుల కోసం వేసవి కాలంలో తాగునీటి గిన్నెలను నగరంలోని ప్రతి కూడలిలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ శ్రీనివాస్ వైట్ల, జైలు సూపరింటెండెంట్ రాహుల్, వినోద్ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత




జామియా మసీదు వద్ద ముస్లింలకు రంజాన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని దక్షిణ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 20 మంది ముస్లింలకు రూ.5 వేలు కానుకగా అందజేశారు. ఎమ్మెల్యే ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో భాగంగా ఏవీఎన్ కళాశాల దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 37వ వార్డు అగ్రహారం వీధికి చెందిన మైలపల్లి ముసలయ్య పక్షవాతంతో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ కష్టతరమైందని తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.5వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, మారోతి శ్రీనివాస్, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బెవర మహేష్, కోరాడ సురేష్, పీసీ అప్పారావు, త్రినాథ్, తాతారావు, కిషోర్‌బాబు, బోణి దేవ, చిన్ని, నాని తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో..

వార్డు పరిధి అచ్చియ్యమ్మపేట, వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లంబా రమణ, బొడ్డేటి ప్రసాద్, వాసుపల్లి నారాయణ, బొడ్డేటి కిషోర్, బొర్రా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుల ధరలు తగ్గించాలని కోరుతూ సంతకాల సేకరణ



కేజీహెచ్ ఓపీ గేటు వద్ద సంతకాలు సేకరిస్తున్న ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు

మహారాణిపేట : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేజీహెచ్ ఓపీ గేటు వద్ద పెరిగిన మందుల ధరల తగ్గించాలని, మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని ప్రజల నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి తుర్లపాటి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదం ప్రకారం ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. 2013 నుంచి ఇప్పటి వరకు మందుల ధరలు పెద్ద ఎత్తున పెరిగాయని, ఎనిమిది వందల రకాల మందులపై 12.12 శాతం ధరలు పెరగడం అనేది ప్రజారోగ్యానికి ప్రమాదకరమన్నారు. బడ్జెట్‌లో ఆరోగ్యంపై అయిదు శాతం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఐ.కె. శేషు, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ చైర్మన్ ఎర్ర శ్రీనివాస్, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి స్రవంతి, చంద్రమౌళి, రాజేష్, హరి తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ నాయకుడు వై.రాజు ఆధ్వర్యంలో ప్రదర్శించిన కళారూపాలు ప్రజలను ఆకర్షించాయి.

వ్యక్తిపై కత్తితో దాడి

అల్లిపురం: ఇద్దరు వ్యక్తుల మధ్య వెటకారం చిలికి చిలికి కత్తితో దాడికి దారితీసిన ఘటన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణామార్కెట్ దరి కల్లు పాకలు ప్రాంతానికి చెందిన గంగాడ గోవింద్ మార్కెట్ సమీపంలో గల ఒక హోటల్లో మధ్యాహ్నం భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో అక్కడికి అదే ప్రాంతానికి చెందిన గండిబోయిన దుర్గాప్రసాద్ కూర కొనుగోలుకు వచ్చాడు. అక్కడే భోజనం చేస్తున్న గోవింద్ అతన్ని చూసి వెటకారం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అది కాస్త తోపులాటకు దారి తీసింది. అనంతరం దుర్గాప్రసాద్ బయటికి వెళుతుండగా గోవింద్ వెనుక నుంచి వెళ్లి బటన్ నైఫ్‌తో నాలుగు చోట్ల పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కేజీహెచ్‌లో చికిత్స అనంతరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదానికి గురైన వాహనాలు

సింహాచలం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నగరంలోని ఏవీఎన్ కళాశాల సమీపంలోని రెల్లివీధికి చెందిన సూరాడ లోవరాజు(36) కొత్తవలస దరి గోల్డ్‌స్టార్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లాడు. శుక్రవారం విధులు ముగించుకుని వస్తుండగా సత్తరవు జంక్షన్ నుంచి అడవివరం రూట్లో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. దువ్వపాలెం క్వారీ జంక్షన్ వద్ద శొంఠ్యాం వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఢీ కొట్టింది. దాంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే లోవరాజు మృతిచెందాడు. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా 108 సకాలంలో రాకపోవడంతోనే లోవరాజు మృతిచెందాడని పలువురు ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



గుడ్ ఫ్రైడే సందేశం వినిపిస్తున్న కల్వరి బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు పీవీ ప్రసాద్



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: నగరంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తును స్తుతిస్తూ సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మానవాళికి ఇచ్చిన సందేశాన్ని పాస్టర్లు చదివి వినిపించారు. అల్లిపురం మెయిన్‌రోడ్డు, కల్వరి బాప్టిస్ట్ చర్చి, ఆంథోనీనగర్‌లో గల సెయింట్ ఆంథోని చర్చి, జగదాంబ దరి లండన్ చర్చితో పాటు కొబ్బరితోట, చలువతోట ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి బాప్టిస్ట్ చర్చి ఫాదర్ రెవరెండ్ జోసెఫ్‌రాజ్ శిలువపై ప్రభువు పలికిన మొదటి, ఐదవ మాటను, రెవరెండ్ జాన్‌పీటర్ రెండు, ఆరు మాటలను, పి.సుమతీ ప్రసాద్ మూడవ మాటను, రెవరెండ్ వేదమణి నాలుగు, ఏడవ మాటలను చదివి వినిపించారు. అంతకు ముందు చర్చి అధ్యక్షుడు రెవరెండ్ పీవీ ప్రసాద్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ఏసుక్రీస్తు కీర్తనలు ఆలపించారు.

ఏఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుధాకర్‌కు సన్మానం



ఏఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌ను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

మహారాణిపేట : కోవిడ్ సమయంలో అందించిన వైద్య సేవలకు గుర్తింపుగా శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్‌ను రాజయోగ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఫౌండేషన్ మెడికల్ వింగ్ (ఆర్‌ఈఆర్‌ఎఫ్), బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు సన్మానించారు. విపత్కాలంలో ధైర్యంగా వైద్యసేవలు అందించినందుకుగాను డాక్టర్ సుధాకర్ సేవలను కొనియాడుతూ ప్రశంసాపత్రంపై బ్రహ్మకుమారీస్ సెంటర్ ఇన్‌చార్జి బి.కె.శివలీల, ఆర్‌ఈఆర్‌ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌మెహత, కార్యదర్శి డాక్టర్ బి.కె.షా తదితరులు సంతకాలు చేశారు.

14 నుంచి సీపీఐ, సీపీఎం ఇంటింటి ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం కార్యదర్శులు పైడిరాజు, జగ్గునాయుడు

అల్లిపురం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై, సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యంపై ప్రజలకు వివరించేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు ఈ నెల 14 నుంచి జిల్లాలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాయని ఆ పార్టీల కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద విధానాలను అనుసరిస్తూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సీఎన్ క్షేత్రపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రోగుల సహాయకుల కోసం షెడ్ల నిర్మాణం



వెయిటింగ్ హాలును ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు



గైనిక్ వార్డు వద్ద నిర్మించిన వెయిటింగ్ హాలు

- కేజీహెచ్ గైనిక్ వార్డు వద్ద ఏర్పాటు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో రోగులకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రి ప్రసూతి రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ షెడ్లు నిర్మించారు. రూ. 12 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణం జరిగింది. గతంలో రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే వారి సహాయకులు వార్డు బయట ఎండకు ఎండి, వానకు తడిసి వార్డు పడిగాపులు కాసేవారు. ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రోగుల సహాయకుల బాధలు చూసి చలించిపోయారు. సీఎస్ఆర్ నిధులతో వెయిటింగ్ హాలు నిర్మించాలని ఆదేశించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీపీ నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు షెడ్లు నిర్మించారు. సామగ్రి భద్రపరచుకోవడానికి కప్‌బోర్డులు, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క షెడ్డులో 20 నుంచి 30 మంది వరకు ఉండడానికి వీలుగా నిర్మాణం జరిగింది. అన్ని సదుపాయాలతో నిర్మించిన వెయిటింగ్ హాలును శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ, డాక్టర్ ఎ.పద్మజ, ఏఆర్‌ఎంవో డాక్టర్ కె.జగదీష్‌కుమార్, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెయిటింగ్ హాలు కోసం నిధులు మంజూరు చేసిన కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి కలెక్టర్ ఎంతో సహకారం అందిస్తున్నారని డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతి

సింహాచలం: పెందుర్తి మండలం చింతలగ్రహారం సమీపంలోని రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. రైలు పట్టాలపై మృతదేహం ఉన్నట్టు గుర్తించి స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసలు మృతుడి జేబులో ఉన్న కాగితంపై ఫోన్ నెంబరు ఆధారంగా నగరంలోని మహారాణిపేటకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (55)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదావశాత్తు రైలు నుంచి పడిపోయాడో లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కర్ణాటక సంగీత కచేరీ

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కర్ణాటక సంగీత కచేరీ జరిగింది. గన్నవరపు రిషిత లక్ష్మి అద్భుత గానంతో త్యాగరాజ, రామదాసు, ముత్తుస్వామి దీక్షితులు కీర్తనలు ఆలపించి ఆహుతులను అలరించారు. వాతాపి గణపతిం, సీతమ్మ, మరుగేలరా, ఎవరూర, ఉపచారము, మా జానకి, తెలిసిరామ, పలుకే బంగార, చరణములే, శ్రీరామ నీనామం, ఎంత పనిచేసితివి కీర్తనలు భక్తులను సంగీత సాగరంలో ఓలలాడించాయి. ఈమెకు ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, బి.గిరిధర్‌రెడ్డి మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని రిషితను అభినందించి సత్కరించారు.